క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో ఓపెన్ ల్యాబ్

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో హైస్కూలు విద్యార్థులకు సోమవారం ఓపెన్ ల్యాబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ స్కూలు విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాల ఎమ్మెస్సీ, బీఎస్సీ రసాయనశాస్త్ర విద్యార్థులు స్కూలు పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా ప్రయోగాలు రూపొందించారు.

బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం

ప్రకాశం నగర్: బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆనంద నగర్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో యువత కోసం హెల్త్ వెల్‌బీయింగ్ అండ్ స్పోర్ట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ దినేష్‌కుమార్, గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక ముఖ్యమైన అంశంగా యువత భావించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీ మోహన్, బ్రహ్మకుమారి హేమ, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తగా కొనసాగుతా

రాజమహేంద్రవరం సిటీ: పార్టీలో ఆశించిన పదవులు రాకపోవడంతో మనస్తాపానికి గురైన మాట వాస్తవమేనని, సీనియర్‌గా పార్టీ కోసం పనిచేస్తానని బీజేపీ నాయకుడు, నగర మాజీ జనరల్ సెక్రటరీ అడబాల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి అన్ని నేర్చుకుని నాయకుడిగా ఎదిగానన్నారు. పార్టీ సంస్థాగత ఎంపికల్లో జనరల్ సెక్రటరీ నుంచి ఉన్నత పదవి అందుతుందని ఆశించానన్నారు. అనుకున్నది దక్కకపోవడంతో మనస్తాపం చెందానని తెలిపారు.

2 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కడియం: కడియపులంకలోని శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వచ్చేనెల 2 నుంచి పదో తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 9వ తేదీ గురువారం ఉదయం 6.59 గంటకు విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు ఉంటాయని వివరించారు. అమ్మవారి విగ్రహంతో పాటు విద్యాలక్ష్మీగణపతి, జ్ఞాన సరస్వతి, పోతురాజస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు.

పందుల కళేబరాల్ని పూడ్చి పెట్టాలి

రాజమహేంద్రవరం రూరల్: పందుల కళేబరాల్ని పూడ్చి పెట్టకపోవడంతో దుర్గంధం వెలువడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు యానాపు ఏసు అన్నారు. సోమవారం ఆయన, పార్టీ నాయకులతో స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలతకు విన్నవించారు. కోలమూరు, కాతేరు, పిడింగొయ్యి, హుకుంపేట సావిత్రి నగర్, శాటిలైట్‌సిటీ పరిసర ప్రాంతాల్లో జనావాసాల మధ్య పందులు మరణిస్తున్నాయన్నారు. అవి అక్కడే రోజుల తరబడి ఉండడంతో దుర్గంధం వెలువడుతోందన్నారు. చనిపోయిన పందులను పంచాయతీ సిబ్బంది పూడ్చిపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ నాయకుడు పట్టాభితో పాటు పలువురిని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ గన్నవరం ఘటనలో టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ నాయకులు రాళ్ల దాడులు చేసి, తిరిగి కేసులు పెట్టారని ఆరోపించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం, వెంకట్రాజు, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.


ప్రజాస్వామ్య విరుద్ధం

రాజమహేంద్రవరం రూరల్: తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విరుద్ధమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పట్టాభి భార్య కొమ్మారెడ్డి చందన, కుటుంబ సభ్యులు సోమవారం సెంట్రల్ జైల్లో ఉన్న పట్టాభిని పరామర్శించిన అనంతరం ఎమ్మెల్యే గోరంట్లను ఆయన నివాసంలో కలిశారు.

జ్ఞానసముపార్జనపై దృష్టి సారించాలి

రాజానగరం: జ్ఞాన సముపార్జనపై దృష్టిని కేంద్రీకరిస్తే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని ఐపీఎస్ విశ్రాంత అధికారి వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో సోమవారం నిర్వహించిన 2022–23 బ్యాచ్ ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను స్వతహాగా ఇంజినీర్‌నని, ఇంజినీర్లు ఆగిపోయిన యంత్రాలను నడిపించగలరన్నారు. అదే వైద్యులు ప్రాణాలతో ఉన్న మనుషుల రుగ్మతలు పోగొట్టేలా మరమ్మతులు చేయగలరన్నారు. అందుకనే వైద్యులను దేవుడిగా భావిస్తారన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ 250 మంది వైద్య విద్యార్థులున్న మొదటి బ్యాచ్ ఇదన్నారు. ఈవిధంగా 250 మంది మెడికోలున్న బ్యాచ్‌లు దేశంలో 30 కళాశాలల్లోనే ఉన్నాయన్నారు. అనంతరం కళాశాలలోని రోబోటిక్ కెడవర్ లాబ్, అనాటమీ లాబ్, సిమ్యులేషన్ లాబ్‌లను లక్ష్మీనారాయణ పరిశీలించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



కంబాలచెరువు: నగరంలో అసాంఘిక శక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడ ఎలాంటి నేరసంబంధ ఘటనలు జరిగినా తక్షణమే స్పందించి చర్యలు చేపడుతున్నారు. సంఘ విద్రోహశక్తుల ఆటకట్టిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలో ఇటీవల ఎవరైనా ప్రమాదవశాత్తూ పడిపోయి గాయాలపాలైనా, గొడవలతో దాడులు చేసుకున్నా ప్రథమంగా వినిపించే మాట బ్లేడ్ బ్యాచ్. నిజంగా బ్లేడ్ బ్యాచ్ చేసిందా, ఇతర కారణాలా అని తెలియకుండానే కొందరు ప్రచారం సాగిస్తున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.

మితిమీరిన బ్లేడ్ సంస్కృతి

నగరంలోని రౌడీషీటర్లు, నేరగాళ్లు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవారు అల్లర్లు, కొట్లాటల్లో బ్లేడ్లతో గాయపర్చడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో అప్పటి నుంచి బ్లేడ్ బ్యాచ్‌గా ప్రచారంలోకి వచ్చింది. రానురాను ఈ సంస్కృతి జడలు విప్పింది. నగరంలో అల్లరి చిల్లరిగా తిరిగే యువకులు కొందరు ఇదేదో బాగుందని చేత్తో బ్లేడ్ పట్టుకుని తిరగడం మొదలెట్టారు. దీన్ని అప్పటి అర్బన్ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి కొంతమేర అదుపు చేశారు. ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవడంతో వీరు మళ్లీ రెచ్చిపోయారు.

- నిఘా పెంచిన పోలీసులు
- జైలులో మగ్గుతున్న బ్లేడ్ బ్యాచ్

జైలులో గంజాయి బ్యాచ్

రాజమహేంద్రవరంలో జరుగుతున్న నేర కార్యక్రమాల వ్యవహారం పైస్థాయి పోలీసు అధికారుల వరకు వెళ్లింది. రాజమహేంద్రవరం నగరంలో బ్లేడ్ బ్యాచ్ యువకుల ఆగడాలు మరోసారి పెచ్చుమీరాయి. వారిలో చాలా మంది నేరగాళ్లని గంజాయి కేసుల్లో జైలుకు పంపడంతో కొన్ని నెలలు నేరాలు కట్టడిలో ఉన్నాయని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో జైలుకు వెళ్లిన వీరంతా బెయిలుపై విడుదలై మరలా అమాయక ప్రజలపై దాడులకు దిగుతూ బెంబేలెత్తిస్తున్నారు. బ్లేడు సంస్కృతిని ప్రోత్సహిస్తూ నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు ప్రయోగించి జైలుకు పంపితేనే ప్రజలకు ప్రశాంతతను ఇవ్వగలమనే నిశ్చయంతో పోలీసులు ఉన్నారు. తదనుగుణంగా కార్యాచరణకు సిద్ధమయ్యారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా సీహెచ్.సుధీర్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, రాత్రుళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై ఆయన దృష్టి సారించారు. శాంతిభద్రతల నియంత్రణలో భాగంగా రెక్కీ నిర్వహిస్తున్న పోలీసులకు గంజాయి సేవిస్తూ కొందరు, గంజాయితో కొందరు పట్టుబడుతూ వచ్చారు. వీరిని బ్లేడ్ బ్యాచ్‌గా హల్‌చేసే వ్యక్తులుగా గుర్తించారు. అయితే గంజాయి తాగే బ్యాచ్‌లు పోలీసుల దాడుల్లో దొరికేవారు. వీరిలో కొందరు బ్లేడ్ బ్యాచ్ కావడం కొసమెరుపు. ఈ విధంగా బ్లేడ్ బ్యాచ్ వ్యక్తులు గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడి జైల్లో మగ్గుతున్నారు.

బెదిరించినా జైలుకే...

జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కొందరు దీన్ని ఆసరాగా తీసుకుని మేం బ్లేడ్ బ్యాచ్ అంటూ బెదిరింపులకు గురిచేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు దీనిపై ఉక్కుపాదం మోపారు. ఎవరైనా బ్లేడ్ బ్యాచ్ అని పేరు చెప్పి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే జైలుకి పంపేలా చర్యలు తీసుకుంటున్నారు.

పూర్తిగా నియంత్రించాం



ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారిపై దాడులు చేస్తున్న వ్యక్తులను పూర్తిగా నియంత్రించాం. ఇటువంటి వారిపై నిఘా పెట్టాం. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి వెంటనే విచారణ చేపడుతున్నారు. బ్లేడ్ బ్యాచ్‌గా చెప్పుకుంటున్న వారిని, గంజాయి తాగుతున్న వారిని గుర్తిస్తున్నాం. ఇప్పటివరకు సుమారు 60 మంది పైగా అరెస్టు చేసి జైలుకి పంపాం.

– ఎం.రజనీ, జిల్లా అడిషనల్ ఎస్పీ

చందనను కలిసిన పోసికుమార్



చందన నాగేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను సోమవారం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దివ్యాంగులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. గోలి దేవకుమార్, తలారి వరప్రసాద్, సబ్బెళ్ల విజయదుర్గ, మత్స్యేటి శివ, రజనీ కుమార్, సాగర్, పుష్కర్, బి.దుర్గ, పి.సత్యవేణి, ఆర్.సత్యవేణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కడియం: దుళ్ల వినాయకుని కాలనీలోని వినాయకుడి విగ్రహ 27వ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరలోనే నగరంలో డ్వాక్రా బజార్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- 49వ డివిజన్‌లో మహిళా సదస్సు

రాజమహేంద్రవరం సిటీ: త్వరలోనే నగరంలోని పలు ప్రధాన జంక్షన్లలో షాపులు నిర్మించి మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పిస్తామని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. స్థానిక 49వ డివిజన్ సుబ్బారావు నగర్‌లో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ 49వ డివిజన్ ఇన్‌చార్జి బర్రె కొండబాబు అధ్యక్షతన సోమవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలు ఆధునిక పోకడలను అర్థం చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధించేందుకు ముందుకు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి చేస్తున్న కృషిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ డివిజన్‌లో దాదాపు 200 డ్వాక్రా సంఘాలు ఉన్నాయంటేనే చైతన్యం కనిపిస్తోందని, అదే స్ఫూర్తితో వ్యాపార, వాణిజ్య రంగాలలో అడుగు పెట్టి నగర ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంకిస భవానీ ప్రియ, పాలిక శ్రీను, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాలోత్సవంలో కడియం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: రాజమహేంద్రవరం వీటీ డిగ్రీ కాలేజీ వేదికగా ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన గోదావరి బాలోత్సవంలో కడియం హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు. సీనియర్స్ జానపదం విభాగంలో ప్రథమ, లఘు నాటికలో ద్వితీయ, జూనియర్స్ జానపద పాటలు, ఏకపాత్రాభినయంలో ద్వితీయ, బెస్ట్ ఫ్రం వేస్ట్ విభాగంలో తృతీయ స్థానాలు సాధించారన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని పవిత్ర నటనను పలువురు ప్రశంసించారన్నారు. ఈ మేరకు సోమవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీయుద్దీన్, పుష్పకుమారి, డేవిడ్, నాగమణి, శరత్ పాల్గొన్నారు.

- కడియం మినర్వా పబ్లిక్ స్కూలు విద్యార్థులు పలు అంశాల్లో ప్రతిభ చూపారని కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. తెలుగు ఉచ్ఛారణ సీనియర్స్‌లో ఆర్.నీరజ ద్వితీయ, లఘునాటికలో ఏ.శరణ్య బృందానికి తృతీయ, జూనియర్స్ విభాగంలో లఘు నాటికకు ఎస్.దుర్గాభవాని బృందానికి తృతీయ బహుమతులు లభించాయన్నారు.

ప్రతి కుటుంబంతోనూ మమేకం కావాలి

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



పొట్టిలంక సమావేశంలో పాల్గొన్న కో ఆర్డినేటర్ చందన, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులుగా నియమితులైన వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు తమ పరిధిలోని ప్రతి కుటుంబంతోనూ మమేకం కావాలని ఆ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ కోరారు. మండలంలోని దుళ్ల వీవర్స్ కల్యాణ మండపం, మురమండ చెరుకూరి కల్యాణ మండపం, వీరవరం కల్యాణ మండపం, పొట్టిలంకలోని పార్టీ కార్యాలయంలో ఆయా గ్రామాల గృహసారథులతో సోమవారం సమావేశం నిర్వహించారు. చందన నాగేశ్వర్ ముఖ్య అతిథిగా, పొట్టిలంక సమావేశానికి డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

ప్రజలకు అవగాహన

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంతోనూ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత వలంటీర్‌తో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పాఠశాలల ఆధునీకరణ, పెన్షన్లు, అమ్మ ఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా తదితర పథకాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సంక్షేమ పథకాలను కొనసాగించడం సీఎం జగన్ వల్లే అవుతుందన్నారు. మన భవిష్యత్తు.. మన జగన్ అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు యర్ర సూర్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, పార్టీ నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, బత్తుల రాము, కొత్తపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వీరుల చరిత్రను నిక్షిప్తం చేయాలి

కంబాలచెరువు: స్వాతంత్య్ర సమర వీరులు, వారితో సంబంధం ఉన్న స్థలాలను డిజిటల్‌లో నిక్షిప్తం చేయడానికి కృషి చేయాలని కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమా నందూరి అన్నారు. ఆజాదీకా అమృతోత్సవాలలో భాగంగా స్థానిక గరిమెళ్ల సత్యనారాయణ అత్యున్నత విద్యాధ్యయన సంస్థ (బీఈడీ ట్రైనింగ్ కాలేజీ)లో సోమవారం సెంటర్ ఆఫ్ కల్చర్ అండ్ రిసోర్స్ ట్రైనింగ్ (సీసీఆర్‌టీ) వర్క్‌షాపు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మరుగున పడిన స్వాతంత్య్ర సమరవీరులపై పరిశోధనలు చేసి, వాటిని 500 పదాల లోపు ఆధారాలతో నిక్షిప్తం చేయాలని సూచించారు. రీజినల్ సెంటర్ కన్సల్టెంట్ కేవీ.చంద్రశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ సౌందర్య, సీసీఆర్‌టీ డీఆర్పీ కేవీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ డిస్ట్రిక్ట్ రిపోజిటరీ (డీడీఆర్) ప్రాజెక్ట్ మనకు మంజూరైనందున గోదావరి జిల్లాలోని సమరయోధుల వివరాలు, ఇక్కడ ఉన్న స్వాతంత్య్ర ముఖ్య ఘట్టాలను పొందుపరిచే ప్రయత్నం చేయడానికి అవసరమైన సలహాలు సూచనలు చేశారు.

మూడు పూరిళ్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తినష్టం

మధురపూడి: కమ్మరి కొలిమి నుంచి రేగిన మంటల కారణంగా సోమవారం మధ్యాహ్నం కోరుకొండ బస్టాండ్ ఎదురుగా మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వాటిలోని సామగ్రి, నగదు, వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. పీతా సుబ్రహ్మణ్య తన కమ్మరి కొలిమిలో కత్తులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు రేగాయి. అందులోని కార్మికులందరూ బయటకు వచ్చేశారు. కమ్మరి కొలిమిని ఆనుకుని ఉన్న చింతా పాపమ్మ పండ్ల దుకాణం అలాగే కొవ్వూరి లోవరాజు, రమణమ్మ నివాసం ఉంటున్న ఇంటికి మంటలు వ్యాపించాయి. వాటిని అదుపు చేసేందుకు స్థానికులు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది రెండు ఇంజిన్లతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కమ్మర కొలిమిలో సరకులతో పాటు ఇతర సామగ్రి, నగదు కాలిపోయింది.



కాలిపోయిన తాటాకిళ్లు

కొవ్వూరి లోవరాజు ఇంట్లోని బీరువా, ఇతర వస్తువులు, నగదు బూడిదయ్యాయి. పాపాయమ్మ పండ్ల దుకాణంలో సామగ్రి, పండ్లు కాలిపోయాయి. కాగా.. బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు నేతుల చిన్ని, ఉల్లి గణ, బొండాడ చందు సహాయం అందించారు. జనసేన నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

ఎమ్మెల్సీ తోట పరామర్శ

కడియం: కడియపులంక గ్రామానికి చెందిన నర్సరీ రైతు తిరుమలశెట్టి సత్యనారాయణమూర్తి మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కడియపులంకలోని వారి స్వగృహానికి వచ్చి సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారి కుమారులను పరామర్శించారు. తోట వెంట ప్రముఖ సినీదర్శకులు గీతా కృష్ణ, స్థానిక నాయకులు వార రాము, బోడపాటి మూర్తి, తుమ్మి చిన్నబ్బులు, అడ్డగర్ల రమేష్ తదితరులు ఉన్నారు.



సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

సంక్షేమ వసతి గృహం పరిశీలన



విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

ధవళేశ్వరం: గ్రామంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేవాధికార సంస్థ ఆదేశానుసారం వసతి గృహం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. అనంతరం ధవళేశ్వరం బాలుర హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు.

జగన్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం

- ఎంపీ భరత్ రామ్
- వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రగతి పథంలో పయనిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం 49వ డివిజన్లో నిర్వహించిన మహిళా సదస్సు అనంతరం 48వ డివిజన్ టీడీపీ నాయకుడు, ఎస్సీ ఉద్యమ నేత ఏనుగుపల్లి రామకృష్ణ తన మిత్ర బృందం 200 మందితో ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఎస్సీలను కించపరుస్తూ గతంలో చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను ఎస్సీలే కాదు, రాష్ట్ర ప్రజలెవరూ మర్చిపోరన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన రామకృష్ణకు కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులాలు, పార్టీలకు అతీతంగా పాలన అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండటం వల్లనే అన్ని వర్గాల ప్రజలు జగనన్నను ఆదరిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే సామాన్య ప్రజలు చంద్రబాబుకు గుర్తుకు వస్తారన్నారు. ఉత్సాహవంతుడు, ఉద్యమ నేత ఏనుగుపల్లి రామకృష్ణ వైఎస్సార్ సీపీలో చేరడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వరరెడ్డి, బర్రె కొండబాబు, సంకిస భవానీ ప్రియ, పాలిక శ్రీను, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ భరత్‌రామ్, అడపా శ్రీహరిలను గజమాలతో సత్కరించారు.

రైల్వే లోకో పైలెట్ల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: సంబంధం లేని పనులతో ఉన్నతాధికారులు చేస్తున్న వేధింపులు తక్షణమే నిలుపుదల చేయాలంటూ రైల్వే లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్ ఫాం రైల్వే క్రూ కంట్రోల్ లాబీ వద్ద ధర్నా నిర్వహించారు. వారానికి ఇవ్వాల్సిన సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. రైల్వేబోర్డు లోకో రన్నింగ్ యూనిట్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ అధికారులు కౌన్సెలింగ్ పేరుతో ఇబ్బందులు పెట్టే ప్రయత్నం మానుకోవాలన్నారు.

నగరంలో డాక్టర్ రవిచంద్ర వైద్య సేవలు

కంబాలచెరువు: ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర వట్టిపల్లి రాజమహేంద్రవరంలో వైద్య సేవలు అందించనున్నారు. దీనిలో భాగంగా వీఎల్.పురంలోని సిద్ధార్థ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించారు. ఈ మేరకు ఆ వివరాలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల్లో వచ్చే ఆర్థో సమస్యలు, కీళ్ల మార్పిడి, అవయవాల సవరింపులు చేయనున్నామన్నారు. తమ వైద్యసేవల విస్తరణలో భాగంగా సిద్ధార్థ చిల్డ్రన్ ఆసుపత్రిలో ప్రతినెలా నాలుగో ఆదివారం వైద్యసేవలు అందించనున్నట్టు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 91002 25574 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రవిచంద్ర